క్లుప్తంగా

అభ్యసన సామర్థ్యాల పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈఓ

నిండ్ర : స్థానిక ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ శ్రీధర్ రాజు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. పిల్లలకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వడ్డించాలని ఆదేశించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు.

వసతుల కల్పనకు వినతి



ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నేతలు

పుత్తూరు: నగరి నియోజకవర్గంలోని ఆది ఆంధ్రవాడల్లో మౌలిక వసతులు కల్పించాలని ఎమ్మార్పీఎస్ నేతలు కోరారు. సోమవారం ఈ మేరకు ఎమ్మెల్యే భానుప్రకాష్‌కు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ దళితవాడల్లో సరైన సదుపాయాలు లేక ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. ప్రధానంగా శ్మశాన వాటికలు, తాగునీరు, రోడ్లు లేవని వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎమార్పీఎస్ నేత గోపీ మాదిగ. తిరుపతి జిల్లా కార్యదర్శి మునివేలు మాదిగ, నగరి నియోజకవర్గ ఇన్‌చార్జి శివయ్య, నేతలు వినోద్‌కుమార్, అజిత్‌కుమార్, దాము, మాతయ్య, వేణు, వెంకటేష్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయండి

శ్రీరంగరాజపురం: ప్రజాప్రతినిధులు, అధికారులు పంచాయతీల సుస్థిరాభివృద్ధికి కృషి చేయాలని ఎంపీడీఓ మోహన్‌మురళి అన్నారు. మండలస్థాయిలో మండల కార్యాలయంలో గ్రామాల అభివృద్ధిపై ప్రజాప్రతినిధులు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకమన్నారు. గ్రామాల అభివృద్ధి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. గ్రామస్థాయిలో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కోదండరామిరెడ్డి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి



మాట్లాడుతున్న తహసీల్దార్ అరుణ కుమారి

పాలసముద్రం : మండల పరిధిలో ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన భూసమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని తహసీల్దార్ అరుణ కుమారి తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందితో ఆమె సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలకు గురవుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, క్షేత్రస్థాయిలో వీఆర్‌ఓలు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రిషివర్మ, ఆర్ఐ దేవి, మండల సర్వేయర్ గణేష్, వీఆర్‌ఓ శీను, త్యాగరాజ్, రమేష్, రమణయ్య పాల్గొన్నారు.

ప్రారంభమైన తిరుప్పావై

పుత్తూరు: పట్టణంలోని ద్రౌపదీదేవి సమేత శ్రీధర్మరాజస్వామి ఆలయంలో సోమవారం ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా తిరుప్పావై ప్రారంభించారు. మూలమూర్తులను విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. టీటీడీ అళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో డాక్టర్ సి.గోవింద స్వామి తిరుప్పావై ప్రవచనం చేపట్టారు. ఈ మాసంలో ప్రతి రోజూ సాయంత్రం 6.30 నుంచి 7.30 గంటల వరకు తిరప్పావై నిర్వహించనున్నారు. ఈ క్రమంలోనే ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. అలాగే బజారు వీధిలోని గంగమ్మ ఆలయం, ఆరేటమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రికార్డుల పరిశీలన

పాలసముద్రం: డ్వాక్రా సంఘాల సభ్యులు వీఓలు తీసుకున్న రుణాలను కొట్టివేతలు లేకుండా నమోదు చేయాలని డీఆర్‌డీఏ ఆఫీసెస్ లీగల్ కోఆర్డినేటర్ (డీఎమ్‌జీ) సుధాకరన్, ఏపీఓ కల్పలత తెలిపారు. సోమవారం మండలంలో డ్వాక్రా సంఘాల్లో 2024 ఏప్రిల్ నుంచి నవంబర్ వరకు తీసుకున్న వీఓలో తీసుకున్న రుణాలపై అంతర్గత ఆడిటింగ్ చేశారు. ఏపీఓ కల్పలత మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉదేశంతో వీఓలు నగదు ఇస్తారన్నారు. వాటిని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ముందుకు ఎదగాలని తెలిపారు. అనంతరం వీఓలో తీసుకున్న రుణాల రికార్డులను తరవుగా పరిశీలించారు.

అనుగృహం లేక అవస్థలు

వడమాలపేట : జగనన్న కాలనీలో పెరిగిన ముళ్లపొదలు



- జగనన్న కాలనీలపై చిన్నచూపు
- పేదల ఇళ్ల వద్ద కనీస వసతుల కరువు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- నిర్లక్ష్యం వహిస్తున్న అధికార యంత్రాంగం
- నివాసాల నడుమ పెరిగిన ముళ్ల పొదలు
- ఆందోళనలో లబ్ధిదారులు

విజయపురం : పేదలందరికీ పక్కా ఇళ్లు ఉండాలని ఉన్నత లక్ష్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జగనన్న కాలనీలు ఏర్పాటు చేసింది. అర్హులందరికీ పట్టాలు అందించి ఇల్లు కట్టుకునే వెసులు బాటు కల్పించింది. ఈ క్రమంలో పలువురు ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకుని అందులో నివసిస్తున్నారు. మరికొందరి గృహాల నిర్మాణం వివిధ దశల్లో ఉంది. కానీ ప్రస్తుతం పరిస్థితి తలకిందులైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జగనన్న కాలనీలపై పర్యవేక్షణ కొరవడడంతో లబ్ధిదారులు తీవ్రంగా అవస్థలు పడుతున్నారు.

1,300 మందికి పట్టాలు

విజయపురం మండలంలో విజయపురం, నార్పరాజుకండ్రిగ, శ్రీహరిపురం, ఇల్లత్తూరు, కలియంబాకం, కలియంబాకం బీసీ్స మిట్టూరు, ఎల్లసముద్రం ఎస్టీకాలనీ, ఆలపాకం, ఆలపాకం కండ్రిగ, పన్నూరు, పన్నూరు దళితవాడలో ఏర్పాటు చేసిన 11 జగనన్న కాలనీల్లో సుమారు 350 మందికి ఇంటి పట్టాలను గత ప్రభుత్వం మంజూరు చేసింది. అలాగే వడమాలపేట మండలం కాయంపేటలో సుమారు 889 మందికి, టీసీ అగ్రహారంలో సుమారు 250 మందికి పైగా ఇంటి పట్టాలు పంపిణీ చేసింది. మొత్తం 1,300 ఇంటి పట్టాలు అందించగా, అందులో 480 ఇళ్లు పూర్తయ్యాయి. మిగిలిన 720 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఇళ్లు నిర్మించుకునేవారు ఇబ్బందిపడుతున్నారు. కనీస మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు అలసత్వం వహించడంతో అవస్థలు పడుతున్నారు. ఇంటి నిర్మాణం చేపట్టమని వెంటపడే అధికారులు, ఆయా ప్రాంతాల్లో సదుపాయాలు కల్పించడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు.

వసతులు అవసరం

వడమాలపేట మండలం కాయంపేట, విజయపురం పోలీసు స్టేషన్ ఆవరణలోని జగనన్న కాలనీలో పలువురు గృహాలు నిర్మించుకున్నారు. అయితే కాలనీల్లో ఎలాంటి మౌలిక వసతులు లేవు. అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. వీధి దీపాల పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంది. తాగునీటి వసతులు లేక లబ్ధిదారులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఇంటి నిర్మాణాల క్రమంలో ఇసుక, కంకర, ఇటుకలు తోలుకునేందుకు లారీలు, ట్రాక్టర్లు వస్తుంటాయి. అవి తిరుగుతుండడంతో రోడ్లన్నీ గుంతలమయం గా మారిపోతున్నాయి. కాలనీలో గృహాల మధ్య ముళ్లచెట్లు నిండి పోయి చిట్టడవులను తలపిస్తున్నాయి. అలాగే వివిధ దశలో నిలిచి పోయిన ఇళ్లకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం లేదు.

ప్రజాధనంపై ప్రభుత్వాలు జవాబుదారీతనంతో వ్యవహరించాలి. పైసా కూడా వృథా కాకుండా పరిరక్షించాలి. గతంలో పరిపాలన సాగించినవారు చేపట్టిన పనులపై వివక్ష చూపకూడదు. ముఖ్యంగా పేదలకు అందించే సంక్షేమ పథకాలపై కక్షగట్ట కూడదు. అయితే ప్రస్తుతం అధికారం వెలగబెడుతున్న కూటమి సర్కారు దుర్మార్గ వైఖరితో ముందుకు సాగుతోంది. నిరుపేదల కోసం ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలను చిన్నచూపు చూస్తోంది. కనీస వసతులు కల్పించడంలో అలసత్వం వహిస్తోంది. రెక్కాడితే కానీ డొక్కాడని బతుకులతో ఆడుకుంటోంది. పాలకుల ధోరణిని అందిపుచ్చుకున్న అధికారులు సైతం పక్కా ఇంటి లబ్ధిదారుల అవస్థలను పట్టించుకోవడం లేదు. ఇబ్బందులను తొలగించేందుకు ఏమాత్రం స్పందించడం లేదు.

> **సిమెంట్ రోడ్లు నిర్మించాలి**
>
> కాలనీల్లో పెరిగిపోయిన ముళ్లచెట్లను తొలగించి, విద్యుత్ సరఫరాను మెరుగు పరచాలి. పైపు లైన్ల లీకేజీ అరికట్టి నీరు వృథా కాకుండా చర్యలు తీసుకోవాలి. సిమెంటు రోడ్లు నిర్మించి, డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. వీధి లైట్లు అమర్చాలి.
>
> – రత్నం, విజయపురం

> **సదుపాయాలు లేవు**
>
> జగనన్న కాలనీలో కనీస సదుపాయాలు లేవు. వీధి లైట్లతో పాటు తాగునీటి వసతులు కల్పించాలి. కాలనీలోని ముళ్లపొదలు, కంపలను తొలగించి రోడ్లు వేయాలి. వివిధ దశలో ఆగిపోయిన ఇళ్లకు నిధులు అందించి, తిరిగి కట్టుకునేలా అధికారులు చర్యలు చేపట్టాలి.
>
> – రాజేష్, వడమాలపేట



వడమాలపేట : టీసీ అగ్రహారం జగనన్న కాలనీలో అధ్వాన్నంగా రోడ్డు.



విజయపురం : ఆలపాకం కండ్రిగ జగనన్న కాలనీలో పిచ్చి మొక్కలు

నేటి నుంచి ఆధార్ స్పెషల్ క్యాంపు

వడమాలపేట (విజయపురం) : వడమాలపేటలోని అంగన్‌వాడీ సెంటర్‌లో మంగళవారం నుంచి రెండు రోజులపాటు ఆధార్ స్పెషల్ క్యాంపు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ శేషగిరిరావు సోమవారం తెలిపారు. అలాగే 19, 20వ తేదీల్లో తిరుమద్యం గ్రామ సచివాలయంలో ఆధార్ శిబిరం ఉంటుందని వివరించారు.

కూలిన ప్రహరీ పరిశీలన



కూలిపోయిన ప్రహరీని పరిశీలిస్తున్న అధికారులు

పాలసముద్రం: మండల పరిధిలోని వెంగళరాజుకుప్పం ప్రాథమిక పాఠశాల ప్రహరీ కూలిన ఘటనపై సాక్షి పత్రికలో కథనం ప్రచురితం కావడంతో సోమవారం జిల్లా సమగ్రశిక్షా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ (ఏపీసీ) వెంకటరమణా రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తుపాన్ ప్రభావం వల్ల కురిసిన వర్షానికి పాఠశాల పక్కన ఉన్న వ్యవసాయ బావిలో నీరు ఎక్కువ కావడంతో బావి గడ్డ కుమిలిపోయి ప్రహరీ పడిపోయిందని, యజమానులతో మాట్లాడి బావిని పూడ్చి వేసి ప్రహరీ నిర్మాణం చేపట్టాలన్నారు. లేదంటే పిల్లలు ఆడుకుంటూ వెళ్లి అందులో జారి పడిపోయే అవకాశం ఉందని తెలిపారు. ప్రహరీ నిర్మాణం చేపట్టేవరకు పిల్లలు అటువైపు వెళ్లకుండా చూడాలన్నారు. ప్రహరీ నిర్మాణం, బావి పూడ్చివేతకు రూ.4 లక్షలు ఎస్టిమేట్ వేశారు. ఆయన వెంట తహసీల్దార్ అరుణకుమారి, ఎంఈఓలు రాజేంద్రప్రసాద్, గిరిజ, ఎంపీడీఓ కృష్ణమహేష్ రెడ్డి, సైట్ ఇంజినీర్ నాగభూషణం, హెచ్ఎం జాన్‌విల్సన్, వీఆర్‌ఓ రమేష్, శీను, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్కిల్ హబ్‌లో ఉచిత శిక్షణ

పుత్తూరు : స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్కిల్ హబ్ సెంటర్‌లో డొమెస్టిక్ ఐటీ హెల్ప్‌డెస్క్ అటెండెంట్‌పై ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ బి.చంద్రమౌళి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ నగరి నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ యువకులు కళాశాలలోని స్కిల్ హబ్ సెంటర్‌లో ఈనెల 21వ తేదీ లోపు తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఏదైనా డిగ్రీ చేసిన వారు అర్హులని వెల్లడించారు. రిజిస్ట్రేషన్ కోసం ఆధార్ కార్డు, మార్క్స్ లిస్ట్, జెరాక్సులతో పాటు ఫొటో తీసుకురావాలని కోరారు. శిక్షణ పొందిన వారికి ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా సర్టిఫికెట్‌తోపాటు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు వివరించారు. వివరాలకు 63009 54441 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

విభిన్న ప్రతిభావంతుల ఉపకరణాల క్యాంపు రేపు



క్యాంపు నిర్వహించే స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డీఓ శ్రీనివాసులు, డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి

శ్రీరంగరాజపురం : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ని ఈ నెల 18వ తేదీన బుధవారం నిర్వహించే ఉచిత క్యాంపును విభిన్న ప్రభావంతులు, వయో వృద్ధులు అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌డీఓ శ్రీనివాసులు అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ పాఠశాలలో క్యాంపు నిర్వహించే స్థలాన్ని డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవితో కలసి పరిశీలించారు. అనంతరం ఆయన శ్రీనివాసులు మాట్లాడుతూ గంగాధరనెల్లూరు నియోజకవర్గ స్థాయిలో శ్రీరంగరాజపురం ఉచిత క్యాంపునకు వచ్చేవారు రేషన్‌కార్డు, ఆధార్, ఫోన్ నంబర్, వికలత్వ ఫొటోలు నాలుగు, సదరం సర్టిఫికెట్, ఆదాయ ధ్రువీకరణ పత్రంతో పాటు మొత్తం రెండు సెట్లు జిరాక్స్ తీసుకురావాలన్నారు. శిబిరంలో అర్హత పొందిన వారికి ఉచితంగా చేతికర్రలు, చంక కర్రలు, వీల్ చైర్లు, వినికిడి యంత్రాలు, బ్యాటరీ సైకిల్, మూడు చక్రల సైకిల్, కుష్టు వ్యాధిగ్రస్తులకు లెప్రసీ కిట్లు, కృతిమ అవయవాల ఉపకరణాలు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ లోకనాథపిళ్లై, ఎంపీడీఓ మొహన్‌మురళి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బంగారమ్మ జాతరకు భారీ భద్రత



పోలీసులను జాతరకు ఆహ్వానిస్తున్న గ్రామస్తులు

కార్వేటినగరం: కార్వేటినగరం గ్రామదేవత శ్రీబంగారమ్మ జాతరకు వంద మంది పోలీసు బలగాలతో గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ హనుమంతప్ప తెలిపారు. సోమవారం కార్వేటినగరం గ్రామపెద్దలు జాతరకు పోలీసులను ఆహ్వానించారు. సీఐ మాట్లాడుతూ ఏడాదికి ఒక్కసారి గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో జరుపుకునే అమ్మవారి జాతరలో గొడవలు జరగకుండా అరికట్టేందుకు సిబ్బంది కృషి చేస్తారని, వారికి యువత సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు ప్రసాద్, కార్యదర్శి చంద్రశేఖర్‌పిళ్లై, రాజశేఖర్, యువరాజు, రవియాదవు, గ్రామస్తులు పలువురు పాల్గొన్నారు.

20న జాబ్‌మేళా

కార్వేటినగరం: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ , డీఆర్‌డీఏ సంయుక్తంగా ఈ నెల 20వ తేదీ నిర్వహించే జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో చంద్రమౌళి అన్నారు. కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వ ఐటీఐలో ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నిరుద్యోగులు ఈ జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఇతర వివరాలకు 81425 09017ను సంప్రదించాలన్నారు.

విద్యుత్ పొదుపుపై వ్యాసరచన పోటీలు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఈఈ సురేష్‌కుమార్

పెనుమూరు(కార్వేటినగరం) : విద్యుత్‌ను పొదుపుగా వాడి భావితరాలకు మార్గదర్శకులుగా ప్రతి ఒక్కరూ ఉండాలని విద్యుత్ శాఖ రూరల్ ఈఈ సురేష్‌కుమార్ అన్నారు. సోమవారం పెనుమూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యుత్ పొదుపు వారోత్సవాలలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యుత్ ఈఈ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే విద్యుత్‌ను పొదుపుగా వాడడం అలవాటు చేసుకోవాలని, తద్వారా భవిష్యత్ తరాలకు మార్గదర్శకులుగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. అంతకుముందు పెనుమూరు సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఏడీఈ శేషాద్రిరెడ్డి, పెనుమూరు ఏఈ తులసీ ప్రసాద్, హెచ్ఎం వెంకటేశులునాయుడు, సిబ్బంది ఉన్నారు.

తండ్రీ కొడుకులపై దాడి

పుత్తూరు: మండల పరిధిలోని ఆనంబట్టు గ్రామానికి చెందిన తండ్రీ కొడుకులు పి.సంపత్(46), పి.యోగానందం(20)పై తొరూరు గ్రామానికి చెందిన జె.చంద్రశేఖర్, జె.లోకేష్ దాడి చేసి గాయపరిచారు. ట్రాక్టర్ సాయంతో భూమి దున్నడానికి వెళ్లినందుకు తమపై దాడి జరిగిందని బాధితులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దాడిలో గాయపడ్డ యోగానందంను పుత్తూరు ఆస్పత్రికి తరలించారు. చంద్రశేఖర్, లోకేష్‌పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి

నిండ్ర: ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ప్రమాదాలకు గురి కాకుండా జాగ్రత్తలు పాటించాలని నగరి రూరల్ సీఐ భాస్కర్ స్పష్టం చేశారు. సోమవారం నిండ్రలో పలువురు వాహనదారులతో ఆయన మాట్లాడారు. బైక్‌లను అధిక స్పీడ్‌లో నడపడం, ఇతర వాహనాలను ఓవర్‌టేక్ చేసేందుకు ప్రయత్నించడం మంచిది కాదని సూచించారు.

సస్యరక్షణతో చీడపీడల నివారణ

నిండ్ర : వరి, వేరుశనగ సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా చీడపీడలను నివారించుకోవచ్చని వ్యవసాయాధికారి తులసీరామ్ తెలిపారు. సోమవారం మండలంలోని జీఎస్ కండ్రిగ, ఆరూరు గ్రామాల్లో సాగులో ఉన్న వరి, వేరుశనగ పంటలను ఆయన పరిశీలించారు. వేరుశనగను ఆశించిన పచ్చపురుగు, లద్దిపురుగుల నివారణకు వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు.

35 మద్యం బాటిళ్లు స్వాధీనం



పట్టుబడిన మద్యం సీసాలు

కార్వేటినగరం: అక్రమంగా తరలిస్తున్న 35 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రాజ్‌కుమార్ సోమవారం వెల్లడించారు. ఎస్ఐ మాట్లాడుతూ మండల పరిధిలోని కత్తెరపల్లి ఏఏ డబ్ల్యూ గ్రామానికి చెందిన డీ.బాబు తమిళనాడు నుంచి ఆదివారం రాత్రి ద్విచక్రవాహనంపై అక్రమంగా మద్యం బాటిళ్లు తరలిస్తుండగా, సిబ్బందితో కలిసి దాడులు చేశారు. అతని వద్ద ఉన్న 35 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, అతనిపై కేసు నమోదు చేసి నోటీసు ఇచ్చి పంపినట్లు పేర్కొన్నారు.

నేడు 'కిశోర వికాసం'

విజయపురం : మండల కేంద్రంలో మంగళవారం కిశోర వికాసం కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు సీడీపీఓ కృష్ణవేణి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులతో పాటు, 11–18 ఏళ్ల లోపు బాలికలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఉదయం 10గంటలన ఉంచి సాయంత్రం 5గంటల వరకు కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

విశ్రాంత ఉద్యోగుల వేడుక రేపు

నగరి : స్థానిక పెన్షనర్ల భవనంలో విశ్రాంత ఉద్యోగుల రజతోత్సవ వేడుకను బుధవారం ఘనంగా నిర్వహించనున్నట్లు పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు జయచంద్రుడు, ప్రధాన కార్యదర్శి ఓ.బాలసుబ్రమణ్యం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశ్రాంత ఉద్యోగులు ఈ వేడుకలకు తప్పక హాజరుకావాలని కోరారు.

ప్రజల వినతులపై దృష్టి పెట్టండి



ఫిర్యాదులను స్వీకరిస్తున్న తహసీల్దార్

శ్రీరంగరాజపురం : ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వచ్చిన వినతులపై రెవెన్యూ సిబ్బంది దృష్టి సారించాలని తహసీల్దార్ లోకనాథపిళ్లై అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 14 వినతులు వచ్చాయి. అందులో మ్యుటేషన్ 05, శ్మశానానికి దారి 01, భూసర్వే 03, ఇంటి నిర్మాణానికి పొజిషన్ మంజూరు చేయాలని 02, పట్టాదారు పాసు పుస్తకం మంజూరు చేయాలని 02, ఇతరుల ఆక్రమణలో భూమిని తొలగించి హద్దులను చూపించాలని 01 వంటి సమస్యలు వచ్చాయన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలు, ధ్రువపత్రాల మంజూరులో జాప్యం లేకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమానికి రెవెన్యూ సిబ్బంది, అర్జీదారులు పలువురు పాల్గొన్నారు.

కరాటే బెల్ట్‌ల ప్రదానం



విద్యార్థులకు బెల్టులు అందిస్తున్న సీఐ మహేశ్వర్

నగరి : కరాటే టెస్ట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బెల్ట్‌లు ప్రదానం చేశారు. సోమవారం ఈ మేరకు ఆర్కే స్పోర్ట్స్ కరాటే అకాడమీలో నిర్వహించిన కార్యక్రమానికి సీఐ మహేశ్వర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 35 మందికి ఎల్లో బెల్టులు, 25 మందికి ఆరెంజ్ , 12 మందికి బ్లూ , 18 మందికి గ్రీన్, ఏడుగురికి బ్రౌన్, 9 మందికి బ్లాక్ బెల్టులు, సర్టిఫికెట్లు అందించారు. సీఐ మాట్లాడుతూ కరాటే ఆత్మరక్షణ కళని, నేర్చుకుంటే ఎంతో ఉపయోగకరమని తెలిపారు. బాలికలు కూడా కరాటే నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్లు రాజ్‌కోటి, లాచి పాల్గొన్నారు.

దెబ్బతిన్న కాజ్‌వే పరిశీలన



కాజ్ వేను పరిశీలిస్తున్న అధికారులు

వడమాలపేట (విజయపురం) : తిరుపతి– చెన్నై జాతీయ రహదారిపై వడమాలపేట వద్ద చీమలవారివంక కాజ్‌వే, పాదిరేడురోడ్డు లోని పెద్ద చెరువు వరవ కాలువలను ఆర్ అండ్ బీ డీఈ అమరనాథరెడ్డి సోమవారం పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలకు కాజ్ వే దెబ్బతినడంతో వడమాలపేటకు 5 రోజులపాటు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ క్రమంలో వాటిని సందర్శించిన డీఈ మాట్లాడుతూ కాజ్‌వే, వరవ కాలువకు తాత్కాలిక మరమ్మతులు చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్ఐ ధర్మారెడ్డి పాల్గొన్నారు.

ఉపాధిహామీ సిబ్బందితో సమీక్ష



మాట్లాడుతున్న ఏపీఓ మార్గేట్

పాలసముద్రం : మండలంలో ఉపాధిహామీ పథకంలో జరిగిన పనుల రికార్డులను సామాజిక తనిఖీ డీఆర్పీలకు త్వరలో ఇవ్వాలని ఏపీఓ మార్గరేట్, జేఈ అనూష తెలిపారు. సోమవారం ఉపాధిహామీ కార్యాలయంలో సిబ్బందితో వారు సమీక్ష నిర్వహించారు. ఏపీఓ మార్గరేట్ మాట్లాడుతూ మండలంలో 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు ఉపాధి కింద చేపట్టిన పనులను సామాజిక తనిఖీ బృందం క్షేత్రస్థాయిలో పరిశీలిస్తుందని తెలిపారు. అందులో అవకతవకలు గుర్తించి జిల్లా స్థాయి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతారని వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

శ్రీరంగరాజపురం : రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. యు.ఎం.పురం గ్రామానికి చెందిన ప్రభాకర్ (52) 49 కొత్తపల్లిమిట్టకు వెళ్లి స్వగ్రామానికి బైక్‌పై బయల్దేరారు. బసివిరెడ్డిపల్లి కాలనీ వద్ద టాటా ఏస్ వాహనం వేగంగా ఆ బైక్‌ను ఢీకొంది. ప్రభాకర్ అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు.

సాఫ్ట్‌బాల్ పోటీలకు తేజశ్రీ

వెదురుకుప్పం : జాతీయ స్థాయిలో నిర్వహించే జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు మండలం విద్యార్థి తేజశ్రీ ఎంపికైనట్లు హెచ్ఎం శ్రీనివాసులు తెలిపారు. హెచ్ఎం మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ఈ నెల 18న జమ్ము కాశ్మీర్‌లో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

గ్రామాల సుస్థిరాభివృద్ధికి కృషి



పాలసముద్రం : సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణమహేష్ రెడ్డి

పాలసముద్రం : మండల పరిధిలోని గ్రామాల సుస్థిరాభివృద్ధికి కృషి చేయాలని ఎంపీడీఓ కృష్ణమహేష్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, ఆరోగ్య సిబ్బంది, సచివాలయ ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో దోమలు వృద్ధి చెందకుండా మిలాథిన్ మందులు పిచికారీ చేయాలన్నారు. ప్రస్తుతం కురిసిన వర్షాలకు గ్రామాల్లో ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకునేలా అవగాహన కల్పించాలని కోరారు. ఆర్‌డబ్ల్యూస్ ఏఈ శంకర్, మండల విస్తరణాధికారి రమేష్, పీహెసీ సీహెచ్ఓ జ్ఞాన శేఖర్, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఆరోగ్యసిబ్బంది, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ప్రణాళికలు రూపొందించుకుందాం..



గంగాధర నెల్లూరు: మాట్లాడుతున్న ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి

గంగాధర నెల్లూరు: గ్రామపంచాయతీలు సుస్థిర అభివృద్ధి చెందే విధంగా ప్రణాళికలు రూపొందించుకుందామని ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి అన్నారు. గ్రామీణ ప్రాంతాల సుస్థిర అభివృద్ధి పేదరిక నిర్మూలన కోసం ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను ఆయన మండలంలోని సర్పంచులకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచులు, మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.